www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025
5
వైఎస్ఆర్



దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి - కడప: ఎస్‌సిలు క్రైస్తవ మతం స్వీకరిస్తే ఎస్‌సి అర్హత కోల్పోతారని ఎపి హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదని ఎపిపిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్ అన్నారు. సోమవారం కడపలో ఆయన మాట్లాడుతూ అనేక కులాల నుండి క్రైస్తవ మతం తీసుకున్న వారికి వారి కులం మారుతుందా? అని ప్రశ్నించారు. కులానికి, మతానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఏ కులంలో లేని విధంగా కేవలం ఒక ఎస్‌సి కులానికే ఈ విధంగా తీర్పు ఇవ్వడం సరైంది కాదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో కూడా కులం వేరు మతం వేరు అని చెబుతుందన్నారు. మతాన్ని సాకుగా చూపి ఎస్‌సి కులానికి అన్యాయం చేయ వద్దన్నారు. దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగా గుర్తించాలని కోరారు. రాజ్యాంగంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాలు ఉన్నాయని, దళిత క్రైస్త వులకు మత స్వేచ్ఛ హక్కులు, రక్షణ కల్పించాలని క్రైస్తవులపై దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో తిరుపతి ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రెండు రోజుల దక్షిణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమీక్షా సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు, వారి జీవన ఆర్థిక స్థితిని మెరుగు పరచడం కోసం ప్రతి వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారి, రైతు స్నేహితులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గత 20 ఏళ్లుగా శాస్త్రీయబద్ధంగా సిద్ధాంత పరంగా సూచించిన సూచనలో రైతులు అనుసరించేవారన్నారు. ప్రస్తుతం రైతులే క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలుగా ఎదుగుతున్నారంటే గర్వించదగ్గ విషయమన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతులకు కావాల్సిన నిజమైన శాస్త్రీయ పద్ధతులను అందజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎదురయ్యే నిజమైన సమస్యలను గుర్తించినప్పుడే రైతులకు సంపూర్ణ స్థాయిలో సహకారం అందించిన వారు అవుతారన్నారు. పరిశోధన ప్రాంతీకతలో పారదర్శకత, నిజాయితీ లేకపోతే కొన్ని రకాల సంస్థలు, వాణిజ్య పంటలుగా పేరొందిన పంట రకాలను మన ప్రాంత రైతులు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. వాతావరణ మార్పులకు, మన ప్రాంత భూమి స్వరూపానికి అనుగుణంగా పంటల పరిశోధన జరగాలన్నారు.. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్ కల్చర్ వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో మార్పు వేసిందన్నారు. సాగునీటి వ్యవస్థలో కూడా విస్తృతమైన, ఉపయోగకరమైన, అనుకూలమైన పద్ధతులను అనుసరించేలా కొత్త పద్ధతులను వెతకాలన్నారు. రైతులు కేవలం తాత్కాలిక లాభాల కోసం జరగకూడదని సాగుబడికి, దిగుబడికి, మార్కెటింగ్ అనువైన లాభదాయకమైన, మెకనైజేషన్ తోకూడిన నాణ్యమైన పద్ధతులను సూచించాలన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను.. రైతులకు ప్రజలకు నేరుగా వారిగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శాస్త్రీయ పద్ధతులను ప్రజలకు చేరవేయడంలో అందుబాటులో ఉన్న అన్ని రకాల కమ్యూనికేషన్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం గుంటూరు లామ్ పరిశోధన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో వ్యవసాయ పంటల సాగు ప్రణాళికను సమగ్రవంతంగా రూపొందించి.. పంటల సాగు లాభదాయకమైన పంటలను ఎంపిక చేయాలని శాస్త్రవేత్తలు, రైతు శాస్త్ర వేత్తలను కోరారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ మాట్లాడుతూ సాగుకు ఆమోదయోగ్యమైన భూములు దక్షిణ మండల వ్యవసాయ ప్రాంత పరిధిలో 30 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆ శాతాన్ని మూడింతలు పెంపొందించేందుకు రైతులను ప్రోత్సహిస్తూ లాభదాయకమైన పంటల సాగుకు సాగులోకి తీసుకు వచ్చేవిధంగా వ్యవసాయ అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు కృషి చేయాలన్నారు. రాస్ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ దక్షిణ మండలం, జిల్లాల విభజన తరువాత తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు మొదలైన ఐదు జిల్లాలుగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. దక్షిణ మండలంలో ఖరీఫ్ సాగులో 3,14,715 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంకు గాను 2,28,688 హెక్టార్లలో (73 శాతం) వివిధ వ్యవసాయ పంటలు సాగుబడి చేయగా రబీలో 4,99,984 హెక్టార్లకు గాను 3,82,470 హెక్టార్లలో (76 శాతం) వివిధ పంటలు సాగు చేయడమైనదన్నారు. అనంతరం దక్షిణ మండల వ్యవసాయ పరిశోధనా కేంద్రం పరిధిలో శాస్త్రవేత్తలు ప్రచురించిన పలు రకాల ప్రచురణ పుస్తకాలను కలెక్టర్ సంబంధిత శాస్త్రవేత్తలు, సంచాలకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ శారదమ్మ, మైనర్ ఇరిగేషన్ అధికారులు, దక్షిణ మండల జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు : సిపిఎం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని పేద, మధ్య తరగతి, కార్మిక, కర్షక, ప్రజల సమస్యలపై పోరాటాలు, కార్యక్రమాలు, ఉద్యమాలు రూపొందించుకొని ప్రజలకు దగ్గర కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన పట్టణ కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం జాతీయ 24వ మహాసభలు పిలుపుమేరకు ప్రజా బహుళయ పార్టీగా తీర్చిదిద్దాలన్నారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పాలన చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. కులాల మధ్య విద్వేషాలను రగిలించడానికి కుట్రపూరితంగా బిజెపి ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ మంత్రులు వెల్లడిస్తున్నారని తెలిపారు. కులగణనపై మనువాదుల నిర్ణయం అమలు మార్గదర్శకరణం నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మండల్ కమిషన్ 40 సిఫారసులను తీసుకొని సర్వే ఫార్మేట్లు తయారు చేయాలన్నారు. కేంద్రంలో కులగణన పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని బిసి కమిషన్ల చైర్మన్‌లు, సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు, రాజ్యాంగ, న్యాయని పుణులు, ప్రధాన జాతీయ రాజకీయ పార్టీల నాయకులు సభ్యులుగా ఉండా లన్నారు. దళిత గిరిజనులు చర్చిలకు మసీదులకు దేవాలయాలకు వెళ్లినంత



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మాత్రాన కులం మారదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని మరచి అంటరానితనాన్ని సృజించని హైకోర్టులు అశాస్త్రీయమైన తీర్పులు ఇస్తున్నాయని వారు ఊటింకించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు సర్వేశ్వరమ్మ విజయ్ సాల్మన్ శాఖా కార్యదర్శులు శేఖర్ వెంకటసుబ్బమ్మ శీను నాగలక్ష్మి యువజన సంఘం నాయకులు విశ్వనాథ్ డేవిడ్ పాల్గొన్నారు.

కార్మిక వర్గ ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్



కడప : కార్ల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచ కార్మిక వర్గపు ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్ అని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పేర్కొన్నారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని దోపిడీ నుంచి విముక్తి చేసే గొప్ప సిద్ధాంతాన్ని మార్క్స్ రూపొందించారని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు తీవ్రమవుతున్నాయని చెప్పారు. ఒక మనిషిని ఇంకొక మనిషి దోపిడీ చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని కార్ల్ మార్క్స్ ఉధృతం చేశాడని పేర్కొన్నారు. సమాజంలో అందరికీ తిండి, ఇల్లు, బట్ట లాంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, దానికి అనుగుణంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారన్నారు.

సమాజంలో రోజురోజుకు పేదల సంఖ్య పెరుగుతోందని, అదే స్థాయిలో కార్పొరేట్ల సంపద కూడా తీవ్రంగా పెరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ధనిక, పేదల మధ్య అంతరాలు తగ్గించేందుకు మార్క్సిజం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శ్రామిక వర్గం కులం, మతం ప్రాతిపదికన కాకుండా శ్రమ ఆధారంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మార్క్స్ జీవితంలో అనేక త్యాగాలు మనకు సూర్తిదాయకమని, ఆ త్యాగాల స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మార్క్స్, ఎంగిల్స్ కార్మిక వర్గం కోసం తమ యావదాస్థితిని త్యాగం చేయడంతో పాటు కుటుంబంలో అనేక రకాల ఇబ్బందుల్ని ఎదుర్కొని ముందుకు సాగారని అన్నారు. అలాంటి త్యాగ స్ఫూర్తితో దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, అన్వేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, ఫణి రాజు, రసూల్, జార్జి, ప్రవీణ్ కుమార్, ఉదయ్ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రపంచంలోనే అరుదైన మేధావి కారల్ మార్క్స్ అని సిఐటియు పులివెందుల ఏరియా కార్యదర్శి గఫూర్ అన్నారు. కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చిన్న, నరసింహులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్:** కార్మిక వర్గపు ఆశాజ్యోతి, ప్రపంచ గతిని, స్థితిని మార్చేసిన దాస్ క్యాపిటల్ రూపకర్త కారల్ మార్క్స్ అని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కృష్ణారెడ్డి, నాగన్న, ఓబన్న పాల్గొన్నారు.

8న కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి

- యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 8న కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ హెచ్చరించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లు పైగా నగరపాల సంస్థకు, ప్రజలకు పారిశుద్ధ సేవలు అందించారని పేర్కొన్నారు. తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యమే ముఖ్యం అనుకుని సేవలందించి 60 ఏళ్ల నిండిన వారికి ఎటువంటి బెనిఫిట్స్ లేకుండా రిటైర్డ్ చేయడం దారుణమని తెలిపారు. అందుకే రిటైర్డ్ వయసు 62 పెంచి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రిటైర్డ్ బెనిఫిట్స్ గా రూ.10 లక్షలు, పెన్షన్ రూ.10 వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మా ఆందోళన కార్యక్రమం మరింత తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. 7, 8వ తేదీ 24 గంటలు కార్పొరేషన్ ఎదుట మహాధర్నాతో పాటు 24 గంటలు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ అడిషనల్ కార్మికులు వారికి జిఒ నంబర్ 36 ప్రకారం వేతనాలు, 9 మంది పెండింగ్ డ్రైవర్లకు రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరాములు, నగర కమిటీ నాయకులు సుంకర కిరణ్, ఆదాం, చెన్నయ్య, ప్రసాద్, ఆశి బాబు, హరి, ఆనంద్, నాగరాజు, కొండయ్య, సాయమ్మ, రమీజా, కార్మికులు పాల్గొన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులను తొలగించవద్దని మేయర్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమ్మె ఒప్పందాల జిఒలు జారీ చేయాలి : సిఐటియు

బద్వేలు: మున్సిపల్ కార్మికులు గతేడాది నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త 17 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన ఒప్పందాలకు జిఒలు జారీ చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బద్వేలు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 17 రోజుల సమ్మె ఫలితంగా ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటై ర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.75 వేలు చెల్లిస్తామని, దహన సంస్కారాల ఆర్థిక సహకారాన్ని రూ.20 వేలు చెల్లిస్తామని, ఇంజనీరింగ్ కార్మికు లకు వేతనాలు పెంచుతామని, తదితర అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకొని నేటికీ ఏడాదిన్నర అయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభు త్వం సమ్మె కాలపు ఒప్పందాల జిఒలను జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా 60 సంవ త్సరాలు నిండాయనే నెపంతో కార్మికులను బలవంతంగా పదవీ విరమణ చేయడం హేయమైనా చర్యన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కాలువ నాగేంద్రబాబు, పట్టణ నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, యూనియన్ అధ్యక్షుడు పులి శ్యామ్ ప్రవీణ్, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ, సహాయ కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



కడప : మాట్లాడుతున్న తిరుపాల్



బద్వేలు : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : జెసి

ప్రజాశక్తి - కడప

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జెసి అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో ఆమె ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కడప పట్టణం పాలెంపల్లెకు చెందిన సి.వెంకట సుబ్బమ్మ వితంతు పింఛను పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. దువ్వూరు మండలం, కానగూడూరుకు చెందిన పి.ఖాసీంబీ తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నీటి కనెక్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్, ఎస్‌డిసి శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కడప: ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి బోల పద్మావతి అని ఈటె రామచంద్రయ్య అన్నారు. బోలా పద్మావతి వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బోలా పద్మావతి మూడుసార్లు కౌన్సిలర్‌గా ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్‌గా మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు దగ్గరగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బోలా జయరామ, బోలా వెంకట చక్రధర్, బోలా తనూజా, ఈటె వెంకట జగన్నాథ్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

వై.ఎస్.షర్మిల 12న కడపకు రాక

- డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప: పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల 12వ తేదీన కడప వస్తు న్నట్లు డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నాయకులతో షర్మిల పార్టీ అభివృద్ధికి దిశా నిర్దేశం నిర్దేశం చేస్తారన్నారు. పర్యటన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌పీర్, ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు షేక్ నీలం, మైనార్టీ రాష్ట్ర ఉపా టధ్యక్షుడు ఖాజా మైనుదిన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీఖ్‌ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు సంజయ్ కాంత, శ్యామలమ్మ, సునీత అబ్దుల్ సత్తార్ హరి ప్రసాద్. గంగయ్య హమీద్, అబ్దుల్ సత్తార్, హరిప్రసాద్, గంగయ్య, పాలగిరి శివ పాల్గొన్నారు. అంతకుముందు విజయజ్యోతి ఎస్‌పి అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలు ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార నిమిత్తం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్వి సయ్యద్ గౌస్‌పీర్, ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కడప: అసంఘటిత కార్మికులు అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మనోహర్, పారా లీగల్ వాలంటీర్ దశరథ రామిరెడ్డి అన్నారు. అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాల సందర్భంగా కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సోమవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పారిశ్రామిక కార్మికులు, వలస కార్మికులు, అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఇ-శ్రమ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసంఘటిత కార్మికుల, వ్యవసాయ కార్మికుల యొక్క సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు.

15న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు సిఇఒ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న నిర్వహించ తలపెట్టిన సర్వసభ సమావేశం క్యాబినెట్ మీటింగ్ సందర్భంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని పేర్కొన్నారు.

భూములు చూపించకపోతే ఆందోళన

ప్రజాశక్తి-కాశినాయన: మండలంలోని కొండరాజుపల్లె గ్రామ పేద బడుగు బలహీన వర్గాల వారికి వారి భూములు వారికి చూపించకపోతే ఆంధ్ర ప్రదేశ్ దళిత సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి ఎల్లయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన కొండరాజుపల్లె పేదల ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండరాజుపల్లె పేద దళితులకు 1998 సంవత్సరంలో అప్పుడు ప్రభుత్వం కత్తిరిగండ్ల గ్రామ పొలంలో సర్వేనెంబర్ 417 నందు భూ పంపిణీ నిర్వహించి వారికి పట్టాలు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారన్నారు. నేటి వరకు వారికి భూములు ఎక్కడ ఉన్నాయనే విష యంపై ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. అసలు వారికి భూమి చూపించలేదన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు తహశీల్దార్‌కు ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం దక్కలేదని చెప్పారు. మా భూములు చూపించమని అధికారుల చుట్టూ తిరిగితే వారిని పట్టించుకున్న నాథుడే లేడన్నారు. ఇప్పటికైనా తహశీల్దార్ చర్యలు తీసుకుని పేదలకు ఇచ్చిన పట్టాలకు సంబంధించి భూమి కొలతలు వేయించి హద్దులు చూపించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ భూ సమస్య పరిష్కరించకపోతే మా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సమైక్య ప్రతినిధి ఓ.యోహాను బాధితులు పాల్గొన్నారు.

రేపటి వైవీయూ డిగ్రీ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల బిఎ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బిబిఏ, ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల కు ఈ నెల 7వ తేదీన జరగాల్సిన పరీక్షను వాయిదా వేసి నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృషా?రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ ఐసెట్ పరీక్ష ఉందని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, యోగివేమన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వాయిదా వేసిన పరీక్షలను ఇదే నెల 23వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన లక్ష్మీరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్ : మంత్రి నారా లోకేష్‌ను సోమవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసిన టిడిపి నాయకులు లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29వ తేదీలలో కడపలో జరిగే మహా నాడు కార్యక్రమం కడపలో ఏర్పాటు చేయడం శుభపరిణా మమని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో లోకేష్ పాదయాత్రలో అడుగడుగున అడ్డుకున్నప్పటికీ కడపలో పాదయాత్రకు ఏ విధంగా మా కుటుంబం సహాయ సహకారాలు అందించిందో అదే తరహాలో మహానాడు కూడా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని లోకేష్‌తో వివరించామని తెలిపారు. ఆయన కూడా స్పందిస్తూ మనందరం కలిసికట్టుగా పనిచేసి మహా నాడును విజయవంతం చేయాలని తెలిపారని చెప్పారు. ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం పార్టీ మహానాడు కార్యక్రమంలో ఏ బాధ్యత అప్పగించినా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



లోకేష్‌తో లక్ష్మీరెడ్డి



జెసికి వినతిపత్రం ఇస్తున్న మనోహర్, నాయకులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : పులివెందుల ఎపి కార్ల్‌లో పనిచేస్తున్న 25 మందిని కార్మికులను అకారణంగా తొలగించిన సిఇఒ శ్రీనివాస ప్రసాద్‌రావుపై చర్యలు తీసుకుని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకత్వం విజ్ఞప్తి చేసింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ ప్రారంభం నుంచి కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఏజెన్సీగాను, ఆప్కాస్ పరిధిలో పనిచేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుత ఇన్‌ఛార్జిగా ఉన్న శ్రీనివాస ప్రసాద్‌రావు కార్మికులను కక్షగట్టి ఏజెన్సీతో కుమ్మక్కై కార్మికులను తొలగించడాన్ని వ్యతిరేకించారు. కొందరిని కొనసాగించడం, కొందరిని రావద్దని చెప్పడం దారుణమని చెప్పారు. ఇప్పటికైనా అకారణంగా తొలగించిన సిఇఒపై చర్యలు తీసుకుని తొలగించిన 25 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. స్పందించిన జెసి బుధవారం పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఉదయ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, దస్తగిరి రెడ్డి, పవన్, ఎపి కార్ల నాయకులు హరి, స్టీఫెన్, ఏస్సన్న పాల్గొన్నారు.

బకాయిలు ప్రభుత్వానికి జమ చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 75 రైతు సేవ కేంద్రాలలో రూ 31.94 లక్షల బకాయిలు వసూలు చేయడంలో జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ పరిమళాజ్యోతి నిర్లక్ష్యంగా వ్యవహ రించారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు కొన్న రైతులు డిజిటల్ రూపంలో లావాదేవీలు రైతులకు చేతకాక దీన్ని ఆసరాగా తీసుకుని రైతు సేవా కేంద్రం సిబ్బంది నగదు రూపంలో ఫోన్ పే రూపంలో వసూలు చేశారని తెలిపారు. వసూలు చేసిన డబ్బులు రెండు మూడు రోజుల్లో ప్రభుత్వానికి మార్క్‌ఫెడ్ అధికారులకు జమ చేయాల్సిన రైతు సేవ కేంద్రం అధికారులు దాదాపు 8 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు జమ చేయలేదని పేర్కొన్నారు. రైతులు ఎరువుల కోసం డబ్బులు జమ చేస్తేనే ఎరువులు ఇస్తామని చెప్పిన రైతు సేవ కేంద్రం అధికారులు వసూలు చేసిన డబ్బులు ప్రభుత్వానికి ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయం రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకుపోతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - కడప: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయటం సామాజిక బాధ్యతగా భావించాలని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్య నారాయణ మూర్తి అన్నారు. సోమవారం తెలుగు గంగ కాలనీలోని 30 ఆంధ్రా బెటాలియన్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సిసి కంబైండ్ అన్యువల్ శిక్షణ శిబిరంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్య నారాయణ మూర్తి మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసి ఆరోగ్యంవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ కూడా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయవచ్చన్నారు. ఒక వ్యక్తి దానం చేసిన రక్తం ప్లాస్మా, ప్లేట్లెట్స్ వంటి రూపాలలో ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జె.ఆత్రే, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మన ఆరోగ్యం..మన చేతుల్లోనే..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వైద్యాధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు అన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత అన్నారు. పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఆరోగ్య బోధకురాలు శోభారాణి మాట్లాడుతూ భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత, తుమ్మినప్పుడు, ఆటలు ఆడుకున్న తర్వాత చేతులు శుభ్రంగా కడుగుకోవాలని తెలిపారు. శుభ్రత పాటిస్తే టైఫాయిడ్, పచ్చకామెర్లు, కలరా, వాంతులు నిర్మూలించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, ట్రైనింగ్ స్టాఫ్ స్టూడెంట్స్, స్థానికులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల పట్ల వైసిపి మొసలి కన్నీరు

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముస్లిం మైనారిటీల పట్ల వైసిపి మొసలి కన్నీరు కారుస్తున్నట్లు పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై వైసిపి డబుల్ గేమ్ ఆడుతోందని విమర్శించారు. రెండు నాల్కల ధోరణిగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభలో వక్ఫ్ సవరణ చట్టానికి వైసిపి వ్యతిరేకంగా. రాజ్యసభలో అనుకూలంగా ఓటు వేసిందని తెలిపారు. పౌర సత్వ సవరణ చట్టానికి కూడా బిజెపికి అనుకూలంగా వైసిపి ఓటు వేసిందని వివరించారు. బిజెపి చేతిలో టిడిపి, జనసేన, వైసిపి కీలుబొమ్మలు అని విమర్శించారు. హిందూ అనే పదం బిజెపి పేటెంట్ కాదన్నారు. రాజీవ్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దర్శనం కోసం అయోధ్య ఆలయం తలుపులు తెరిచారన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బిజెపికి సంబంధమే లేదన్నారు. 2002 వరకు నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఎగుర వేయలేదని తెలిపారు.



తులసిరెడ్డిని కలిసి వైసిపి నేత రోహన్ నాగిరెడ్డి

తులసిరెడ్డిని కలిసిన సతీష్‌రెడ్డి తనయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలో ఉన్న సమస్యలపై పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డితో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి తనయుడు రోహన్ నాగిరెడ్డి చర్చించారు. సోమవారం వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని రోహన్ నాగిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వేంపల్లె పంచాయతీలో పలు సమస్యలు అస్తవ్యస్తంగా ఉన్నాయని చర్చించుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులపై ఒత్తిడి చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వేంపల్లెలో ఉన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యచరణపై చర్చించారు. తులసిరెడ్డిని కలిసిన వారిలో వైసిపి నేతలు భరత్‌కుమార్ రెడ్డి, లోకేష్, కాంగ్రెస్ పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధృవకుమార్ రెడ్డి, నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

రైతులు, కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

అమరావతి, పోలవరం అనే విధానంతో రూ.వందల కోట్లు ఖర్చుపెట్టి ఆ ప్రాంత అభివృద్ధికే ఖర్చు చేయకుండా రాయలసీమ జిల్లాలలోని పేద రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ కోరారు. సేవా సమితి మైదుకూరు మండల శాఖ అధ్యక్షులు జివి సత్రం ఎల్లయ్య ఆధ్వర్యంలో కొత్త గంగవరంలో పేద రైతులు, రైతు కూలీలతో కలిసి మాట్లాడుతూ.. ఈనెల 31న కర్నూలు జిల్లా సంగమేశ్వరం వద్ద రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధవరం అలుగు ప్రజా ప్రాజెక్టు తొమ్మిదో వార్షికోత్సవ బహిరంగ సభ జయప్రదం కోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త గంగవరం పేద రైతులు, రైతు కూలీలు గంగారపు ఆనందరావు, బావికాడి శ్రీనివాసులు, మటమ్ రమేష్, రామసుబ్బయ్య, మహిళా రైతులు లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, సుబ్బమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ధయాంఖాన్ పల్లెకు చెందిన దాదం నవీన్‌రావు, దాదం లక్ష్మీదేవిపై హత్యాయత్నం కేసుకు సంబంధించి అదే గ్రామానికి చెందిన దాదం నాగేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ ఆర్.మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సిఐ విలేకరులతో మాట్లాడుతూ.. 2015లో దాదం అనంతరావు పార్వతి అనే మహిళను హత్య చేసిన ఘటనకు సంబంధించి కేసు నమోదైందన్నారు. ఈ కేసు రాజీ విషయమై రూ.20లక్షలు మొత్తాన్ని అనంతరావు చెల్లించేలా ఒప్పందం జరిగింది. ఏడాదిన్నర క్రితం కేవలం రూ.లక్షా 60 వేలు మాత్రమే ఇచ్చారు. మిగతా నగదుకు సంబంధించి అనంతరావు, దాదం నాగేశ్వరరావు మధ్య వాదనలు జరుగుతూ ఉండేవన్నారు. ఒకటిన్నర సంవత్సరం గడువు జరిగిన డబ్బులు ఎంతకీ ఇవ్వకపోవడంతో నాగేశ్వరరావు ప్రతీకారం తీర్చుకోవాలనే కక్షతో అనంతరావు, లక్ష్మీదేవి దంపతులను ఏప్రిల్ 28న చంపేందుకు ప్రయత్నించగా అనంతరావు అందుబాటులో లేకపోవడంతో వదిన లక్ష్మీదేవిపై దాడి చేశాడు. ఆమెకు తీవ్ర రక్త గాయమైంది. బంధువు నవీన్ కుమార్ అడ్డుపడగా అతనిపై కూడా దాడి జరిగిందని సిఐ వివరించారు. కేసు విచారణలో నిందితుడు నాగేశ్వరరావు నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి మచ్చు కత్తి స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. సోమవారం తమకు రాబడిన సమాచారం మేరకు ధయాంఖాన్‌పల్లెలో నిందితుడు ఇంటి వద్ద ఉన్నట్లు తెలియడంతో అరెస్టు చేశామన్నారు. రిమాండ్ నిమిత్తం మైదుకూరు కోర్టులో ప్రవేశ పెట్టామని సిఐ తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐ మోహన్

రైతుకు ప్రోత్సాహం.. ఉద్యాన పంటలకు ఊతం

ప్రోత్సాహకాలపై అవగాహనలేని రైతులు.. ఆ దిశగా అడుగులు వేయని అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయంలో అధిక ఆదాయం పొందాలనే ఉద్దేశంతో రైతులు వాణిజ్య పంటలసాగుపై దృష్టి సారించారు. వాణిజ్య పంటలకు మార్కెట్లో మంచి ధరలు ఉండడంతోపాటు దిగుబడులు బాగా వస్తున్నాయి. దీంతో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో ఎక్కువ మంది రైతులు అరటి, బొప్పాయి, పసుపు, చెరకు, మామిడి తదితర పంటలు సాగవుతుంటాయి. దిగుబడులు ఆశించినంత మేర ఉండడం, గిట్టుబాటు ధరలు ఉండడంతో ఉద్యాన పంటల సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను కూడా అమలు చేస్తోంది. రెండున్నర ఎకరా విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, జామ తోటలకు నాలుగేళ్లకు రూ.50వేలు మొత్తాన్ని ప్రోత్సహకరంగా రైతులకు అందజేస్తుంది. బొప్పాయి, సపోటా, సీతాఫలం వంటి పంటలకు రూ.30 వేలు, టిష్యూ అరటి సాగుకు రెండున్నర ఎకరాకు రూ.70 వేలు, డ్రాగన్ పంటలకు రూ.లక్ష ప్రకారం ప్రభుత్వం ప్రోత్సాహకరంగా అందిస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సహకాల గురించి సరైన అవగాహన లేని రైతులు వాటి గురించి తెలియక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తే ఉద్యాన పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సాహకాల గురించి అవగాహన కల్పించకపోవడం వల్ల ఎక్కువమంది



సాగులో ఉన్న అరటి

రైతులు వాటి సాగుపై పెద్దగా దృష్టి సారించడం లేదని అంటున్నారు. ప్రభుత్వం, ఉద్యానశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు సకాలంలో ప్రోత్సాహకాలు అందేలా గట్టి చర్యలు చేపడితే రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుంది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగడానికి అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఉద్యాన శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు సూచిస్తున్నారు.

చట్ట వ్యతిరేక బ్లాస్టింగ్ ఆపాలని వినతి



జెసికి వినతిపత్రమిస్తున్న వి.అన్వేష్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల జువారి సిమెంట్ కర్మాగారంలో చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న మైనింగ్ బ్లాస్టింగ్ ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన కడపలో ప్రజా ఫిర్యాదుల వేదికలో జెసి ఆదితిసింగ్‌కు వినతిపత్రమిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్లాస్టింగ్ వల్ల సమీప గ్రామాల ఇళ్లు, పొలాలు దెబ్బతింటున్నాయని వివరించారు. సదరు పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను అన్వేష్ వివరిస్తూ జువారి మైన్స్ బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న వలసపల్లి గ్రామ దళిత కాలనీలో ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనింగ్ చేస్తున్న ప్రదేశానికి వలసపల్లి గ్రామం కేవలం 500 మీటర్ల దూరంలో ఉందన్నారు. మైనింగ్ తవ్వకాలు లోతుగా జరుగుతుండడంతో నీటి ఊటలు అక్కడ ఏర్పడి గ్రామాల్లో తాగునీటి బోర్లు ఎండిపోయాయన్నారు. నీటి సమస్య ఏర్పడి ట్యాంకర్లతో నీళ్ల రవాణా చేసే పరిస్థితికి జువారి యాజమాన్యం తీసుకొచ్చిందన్నారు. జువారి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలన్నారు. మైన్స్ బ్లాస్టింగ్ నిలిపేయాలన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. జువారి యాజమాన్యం గ్రామానికి శాశ్వతంగా పైప్‌లైన్ వేసి తాగునీటి ఎద్దడి తీర్చాలన్నారు. వెంటనే సమగ్రంగా విచారణ చేసి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

రూ.20 లక్షల విలువైన బంగారం స్వాధీనం : డిఎస్‌పి



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి భావన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నరాల బాలిరెడ్డి కాలనీలో దొంగతనానికి పాల్పడిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి భావన తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి ఇజి అశోక్‌కుమార్ ఉత్తర్వుల మేరకు తన పర్యవేక్షణలో ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు ధనుంజయుడు, అరుణ్‌రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు బృందాలతో వారిని అరెస్టు చేశామన్నారు. ఖాజా రఫీక్ సయ్యద్ ఏ అస్లాం, మెహబూబ్ ఇబ్రహీం ముల్లా, అర్మాన్ ఇర్ఫాన్ షేక్, సయ్యద్ అక్బర్ ఏ ఎస్ అక్బర్‌ను జమ్మలమడుగు రోడ్డు తిమ్మయ్య కాలనీ జమ్ములమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా ఉన్న వీరిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. మధ్యవర్తుల సమక్షంలో విచారించి, వారి వద్ద నుండి 23.4 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కర్ణాటక బెల్గాం నగరం వైభవ్ నగర్‌కు చెందిన ఖాజా రఫీక్ సయ్యద్, అక్బర్ బాల్య స్నేహితులు. తమ చిన్నతనం నుండి రాత్రి పూట కన్నపు నేరాలకు పాల్పడేవారు. కర్ణాటకకు చెందిన మరొక వ్యక్తితో కలిసి తమ ప్రాంతానికే చెందిన అర్మాణ్ ఇర్ఫాన్ షేక్, మెహబూబ్ అను వారిని తమ సహచరులుగా నియమించుకున్నారని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో పలు నేరాలకు పాల్పడ్డారన్నారు. దొంగతనంలో కీలకంగా ఉన్న మరొక వ్యక్తి ఆచూకీ తేలవలసి ఉందన్నారు. ఇలాంటి దొంగతనాలు పునరావృతం కాకుండా పటిష్టమైన నిఘా ఉంచామని డిఎస్‌పి తెలిపారు. ప్రొద్దుటూలో జరిగిన మిగతా చోరీలను కూడా త్వరలో ఛేదిస్తామన్నారు. దొంగలను పట్టుకోవడంలో ప్రత్యేక ప్రతిభ కనబర్చిన ప్రొద్దుటూర్ త్రీ టౌన్ సిఐ ఎ.గోవిందరెడ్డి, ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐ ధనుంజేయుడు, ప్రొద్దుటూర్ రూరల్ ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి, ఎఎస్ఐ సుబ్బన్న, హెడ్ కానిస్టేబుల్ భద్రారెడ్డి, కానిస్టేబుళ్లు దస్తగిరి, సుబ్రమణ్యం, రమణారెడ్డి, చాంద్‌బాషా, ధనుంజయ, దినకర్, హోం గార్డ్ జి.జనార్దన్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్స్ చేశామని డిఎస్‌పి భావన తెలిపారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యం వినియోగించుకొని దొంగతనాల నివారణలో పోలీసులకు సహకరించలని డిఎస్‌పి కోరారు.



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

మూఢనమ్మకాలతో మోసపోవద్దు : జెవివి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మూఢనమ్మకాలతో మోసపోవద్దని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆటపాట మాట కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా బాలబయన్న సమాజంలో వేళూనుకున్న అనేక మూఢ నమ్మకాలను వివరించారు. వాటి నుండి బయట పడేందుకు మ్యాజిక్కులు, అందులోని లాజిక్కులు పిల్లలకు నేర్పించారు. మూఢనమ్మకాలు ఎదుర్కొనేందుకు మ్యాజిక్ మంచి సాధనమన్నారు. పదార్థాలకు ఎలాంటి మహత్యాలు ఉండవని సైన్స్ ఎప్పుడో చెప్పిందన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ఆలోచన కలిగి ఉండాలని, ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. శాఖ గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఉమాదేవి మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతిరోజు వివిధ మనోవికాస కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల గౌరవ అధ్యక్షుడు కెవి సుబ్బయ్య, పాఠకులు పాల్గొన్నారు.

వేంపల్లె : విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వనజా కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి కోరారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన తరగతుల సందర్భంగా హాజరైన విద్యార్థులకు కథలు చెప్పారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయంలో విద్యార్థులకు కావాల్సిన కథలు పుస్తకాలు, పలుపోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలు ఉన్నాయన్నారు. గ్రంథా లయంలో పుస్తకాలు చదవడం వల్ల కొత్త విషయాలను తెలుసు కోవచ్చన్నారు. పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. వేసవిలో క్రీడల పట్ల ఆసక్తి కూడా పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా 7వ రోజు విద్యార్థులకు గ్రంథాలయ అధికారి జె.శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంగ్ల భాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని అంశాలను బోధిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై వెంకట వరప్రసాద్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఆంగ్ల భాషపై అవగాహన కల్పిస్తున్న వరప్రసాద్ రెడ్డి

ఎపిజిబి ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా డి.మహమ్మద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎపిజిబి ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా తాను ఎంపికైనట్లు డి.మహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మియాపూర్ లోని ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో ఎఐ ఆర్ఆర్ బిఇఎ జాతీయ నాయకులు ఏపీటిఆర్ఆర్‌బిఇఎ అధ్యక్షులు బి.రవికాంత్, టిజిబిఇయు అధ్యక్షులు పి.వేణురావు, ఎన్ఎఫ్ఆర్ఆర్‌బిఇఎ జాయింట్ సెక్రటరీ పివి రాహుల్ తేజ్ ఆధ్వర్యంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్లుతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. తమ నాయకులు, మాతృ సంస్థ



ఎఐఆర్ఆర్ బిఇఎ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి అవిశ్రాంత అలుపెరుగని పోరాటం ఫలితమే ఈ బ్యాంకుల విలీనం, కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం యాజమాన్యంతో ఎక్కడ రాజీలేని పోరాటం చేస్తామన్నారు. అన్ని గ్రామీణ బ్యాంకులతో మమేకమై కలిసి చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కామ్రేడ్ ఇ.హనుమంతరెడ్డి, సీజిబి, ఎస్జిబి, ఏపీజివిబి బ్యాంకుల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతులను సన్మానించిన వ్యవసాయ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని ఎఒ మ్యాగీ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సోమవారం ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఎంటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మ్యాగీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని సూచించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు 16 రకాల నవధాన్యాల విత్తనాల కిట్టు రూ.1000 అందిస్తామన్నారు. అనంతరం ఉత్తమ దిగుబడులను సాధించిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం శ్రీధర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌ఛార్జి మహేష్, రైతు ఉత్పత్తి సంఘం సిఇఒ స్రవంతి, ఎన్ఎఫ్ మెంటర్ జయన్న, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు తెలి పారు. మండలంలోని వై.కొత్త పల్లెలో సోమవారం ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గించి రైతుల ఆదాయం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మరింత విస్తీర్ణంలో చేసేందుకు యాక్షన్ ప్లాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలిచిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణమ్మ, మోడల్ మేకర్ రమణ, రామకృష్ణ, ఐసిఆర్‌పిలు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

ఘటికాచలక్షేత్ర కోశాధికారిగా తోటంశెట్టి చంద్రశేఖర్

ప్రజాశక్తి - వేంపల్లె

తమిళనాడులోని షోలింఘర్ పరిధిలో ఆర్యవైశ్యులు నిర్వహిస్తున్న అఖిల భారత ఘటికాచలక్షేత్ర నిత్యాన్నదాన సమాజం నూతన కోశాధికారిగా వేంపల్లెకు చెందిన తోటంశెట్టి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం అఖిల భారత ఘటికాచలక్షేత్ర నిత్యాన్నదాన సమాజం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ప్రొద్దుటూరుకు చెందిన కామిశెట్టి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి పసుపుల సుబ్రమణ్యం, వేంపల్లెకు చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ జీవిత సలహా సభ్యునిగా వడ్లకుంట వీరయ్య, కార్యదర్శులుగా కాకుమాని సత్య నరసింహులు, తోటంశెట్టి నవీన్ కుమార్, సహాయ కార్యదర్శిగా తోటంశెట్టి పెద్ద పుల్లయ్య, సభ్యులుగా మేడా ప్రసాద్, కర్నాటి నాగేంద్ర బాబు, రాయవరం రవీంద్రబాబు, బైరిశెట్టి బాలగంగాధర్, పుల్లగూర అరవింద్, మధుసూదన్ గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. తమ పదవీ కాలంలో అన్నదాన సమాజాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఆధార్ శిబిరాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ప్రజలు ఆయా కేంద్రాల వద్దకు వెళ్లి వెనుదిరిగి వస్తున్నారు. ఆధార్ శిబిరాలు పెట్టి చిన్న పిల్లలకు పేర్లు నమోదు చేసుకునేందుకు, ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరి చేసేందుకు అవకాశం ఉండడంతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. సోమవారం నుంచి విడతల వారీగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఆధార్ కార్డు సమస్యలకు పరిష్కారం చూపుతామని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ కార్డు ప్రత్యేక శిబిరాలను అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కత్తులూరు సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రం కూడా పని చేయలేదు. ప్రజలు పనులు మానుకుని ప్రతి రోజూ కత్తులూరు వెళ్లి వెనుదిరిగి వస్తున్నారు. ఆధార్ ప్రత్యేక శిబిరాల ఏర్పాటు ప్రకటించి అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ సేవలను అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ కుళ్లాయమ్మను వివరణ కోరగా.. వేంపల్లె మండలంలోని ఆయా ప్రాంతాల్లో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విద్యాభివృద్ధికి వైజిఆర్ ట్రస్ట్ చేయూత

- 10న టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యాభివృద్ధి కోసం తనదైన శైలిలో విద్యార్థులకు మండలంలోని నంద్యాలంపల్లికు చెందిన వైజిఆర్ ట్రస్ట్ చేయూతనిస్తోంది. గతేడాది మండలంలోని నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యుల పేరుతో ట్రస్టును ఏర్పాటు చేశారు. దానికి చైర్మన్‌గా వ్యవహరిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. తాను సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయిలో స్థిరపడినప్పటికీ మండలంలో విద్యాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10న సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహం పంపిణీ చేయనున్నారు. మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదివిన 24 మంది విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతుల కింద వరుసగా రూ.4,000, రూ.3,000, రూ.2,000 ప్రకారం అందజేయనున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సు చదువుతున్న పేద గ్రామీణ విద్యార్థులకు ఒకొక్కరికి రూ.10 వేలు పంపిణీ చేయనున్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం..



మండలంలోని పేద విద్యార్థుల అభ్యున్నతికి వైజిఆర్ ట్రస్ట్ అహర్నిశలు కృషి చేస్తోంది. అందులో భాగంగానే పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహం అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేసేలా సన్నాహాలు చేస్తున్నాం.

- ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి, వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నంద్యాలపల్లె